డా॥ బి.ఆర్. అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్

ఆశయాలు

- కుల రహిత సమాజాన్ని నిర్మించడం కోసం బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు ప్రచారం చేయడం.
- దళితుల సాంఘిక ,ఆర్థిక స్థితిని మెరుగు పరచడం.
- అంటరానితనం పోవాలని, కులాలు పోవాలనే అవసరాన్ని ప్రధానంగా గుర్తింప చేయడానికి పుస్తకాలు, పత్రికలు, కరపత్రాలు ప్రచురించడం, గోష్ఠులు ఏర్పాటు చేయడం.
- అంటరానితనం పోగొట్టడానికి కుల నిర్మూలన గావించడానికి ప్రచారం చేసే రచయితలు, కళాకారులను ప్రోత్సహించడం.
- పేదవాళ్ళు కులాలు, తెగల విద్యార్థులు వివిధ రంగాలలో ప్రావీణ్యత సంపాదించడానికి, వారికి ప్రోత్సాహం ఇవ్వడం.
- విద్యాసంస్థలు నెలకొల్పడం.
- పేదలకు, అందుబాటులో లేని వారికి ఉచిత వైద్యం అందజేయడం.
- కుల అహంకారుల దౌర్జన్యానికి గురైన దళితులు తిరిగి నిలదొక్కు కోవడానికి గృహ పరికరాలు, బట్టలు, ఆహారం, వ్యవసాయ పనిముట్లు, వృత్తి పరికరాలు అందజేయడం.
- దళితుల, ఆదివాసుల పరిస్థితిని మెరుగుపరచడానికి జాతీయ స్థాయిలో ఒక కార్యాచరణ సంస్థను ఏర్పాటు చేయడం.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్మారకోపన్యాసం - 19

రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ - చిన్న రాష్ట్రాలు
డా॥ బి.ఆర్.అంబేద్కర్ అభిప్రాయాలు



ఉపన్యాసకులు :
ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్
మాజీ వైస్ ఛాన్సలర్ , కాకతీయ విశ్వవిద్యాలయం

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్
హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్

ముందుమాట

డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో డిశంబరు 6, ఆయన వర్ధంతి నాడు ప్రతి ఏటా డా॥ అంబేడ్కర్ స్మారకోపన్యాసం ఏర్పాటు చేస్తున్నాము. ఆ ప్రసంగ పాఠాన్ని ఆ తరువాత ప్రచురించటం జరుగుతున్నది. డాక్టర్ అంబేడ్కర్ సిద్ధాంతం, ఆలోచనలు ప్రతిఫలించే రీతిలో ప్రతి ఏడూ ఒక ఉపన్యాసం ఏర్పాటు చేయటమవుతున్నది. ఆయా విషయాలలో నిష్ణాతులైన వారిని, వివిధ రంగాలలో మేధావులను ప్రతి ఏడూ ఆహ్వానిస్తున్నాము. ఈ శృంఖలాలలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చేసిన ప్రసంగం 19వది. 6 డిశంబరు 2004న జయశంకర్ చేసిన ప్రసంగాన్ని ఇపుడు ప్రచురిస్తున్నాం. కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొంత ఆలస్య మయింది.

డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్టును డాక్టర్ అంబేడ్కర్ అనుయాయులు కొందరు 1984లో కొద్దిపాటి మొత్తాన్ని సేకరించి ఏర్పాటు చేశారు. ఆ మొత్తాన్ని బ్యాంక్‌లో డిపాజిట్ చేసి, దానిని ముట్టుకోకుండా, దానిపై వచ్చే వడ్డీతో ఈ ప్రసంగాలను ప్రచురిస్తూ వస్తున్నాం. ప్రభుత్వ

నిధులుగాని, ఆర్థిక సహాయంగాని లేకుండా, పారిశ్రామిక వేత్తలు లేదా ధనవంతులు ఏర్పాటు చేసుకున్న ఫౌండేషన్‌ల అండదండలు లేకుండా కేవలం కొందరు అంబేద్కర్ అనుయాయులు చేస్తున్న ఒక చిన్నపాటి కృషి ఇది. అయితే నిరాటంకంగా ఈ ట్రస్టు 22 ఉపన్యాసాలు జరిపించటం, ఆ ప్రసంగ పాఠాలను ప్రచురించటం సాహసమే అనిపిస్తుంది. దీనిని ఆదరిస్తున్న అభిమానులకు కృతజ్ఞతలు.

డాక్టర్ జయశంకర్ చేసిన ప్రసంగం ఆంధ్రప్రదేశ్‌లో రగులుతున్న ఒక సమస్య పైన. భాషా రాష్ట్రాలు, చిన్న రాష్ట్రాలపై డా॥ అంబేద్కర్ దాదాపు 60 సంవత్సరాల క్రితం వెలిబుచ్చిన అభిప్రాయాలను ప్రొఫెసర్ జయశంకర్ రగులుతున్న ప్రస్తుత రాజకీయ, సాంస్కృతికోద్యమానికి బాసటగా, ఊతంగా, మద్దతుగా తీసుకున్నారంటే డా॥ అంబేద్కర్ ఆలోచనలు ఎంత ప్రతిభావంతమైనవో, ఎంత దార్శనికమైనవో మనకు కనపడుతున్నది. దేశ రాజకీయ అంశాలపై డాక్టర్ అంబేద్కర్‌కు ఎంత దూరదృష్టి, అంచనా, విశ్లేషణ, దార్శనికత, సమ్యక్ దృష్టి ఉన్నదో డా॥ జయశంకర్ చేసిన ప్రసంగంలో కొంత మనకు కనబడుతుంది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయ శంకర్‌కు ధన్యవాదాలు.

డా॥ అంబేద్కర్ ట్రస్టుకు అభిమానులు, పాఠకులు చూపుతున్న ఆదరణకు కూడా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. వారు చూపుతున్న ప్రోత్సాహంతో ఇంకా కొన్ని కొత్త పథకాలను, కార్యక్రమాలను కూడా చేపడతామని, డాక్టర్ అంబేద్కర్ ఆలోచనలను అనేక దిక్కులకు విస్తరింప చేస్తామని ట్రస్టు ఈ సందర్భంగా తెలియజేస్తున్నది.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ధన్యవాదాలు తెలియ చేయటంతో పాటు, ఈ ప్రసంగం ఏర్పాటుకు సహకరించిన సీనియర్ జర్నలిస్ట్ శ్రీమల్లెపల్లి లక్ష్మయ్యకు, ఈ ప్రసంగ పాఠాన్ని తెలుగులోకి అనువదించి ఇచ్చిన శ్రీధరరావు దేశ్‌పాండే, డా॥ భారతి, వారికి సహకరించిన ప్రొ॥ డి. కనక దుర్గ గార్లకు, ఈ ప్రసంగాన్ని ముద్రించిన ప్లానోగ్రాఫర్స్‌కు కృతజ్ఞతలు.

డాక్టర్ కె. లింగయ్య
ఛైర్మన్,
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్
6, డిశంబరు 2007 హైదరాబాద్.

ప్రొ॥ కొత్తపల్లి జయశంకర్ గురించి...



జననం : 06.08.1934, హనుమకొండ

చదువు : ఎమ్.ఏ. (ఆర్థిక శాస్త్రం), బనారస్ హిందూ విశ్వవిద్యాలయం

ఎమ్.ఏ. (ఆర్థిక శాస్త్రం), అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం

పి.హెచ్.డి. (ఆర్థిక శాస్త్రం), ఉస్మానియా విశ్వవిద్యాలయం

ఉద్యోగాలు : అసంఘటిత క్షేత్రంపై జాతీయ కమీషన్ సభ్యులు
కాకతీయ విశ్వవిద్యాలయం ఉప కులపతి
సెంట్రల్ ఇన్సిటిట్యూట్ ఆఫ్ ఇంగ్లీషు అండ్ ఫారిన్ లాంగ్వేజెస్, రిజిస్ట్రార్
కాకతీయ విశ్వవిద్యాలయం, రిజిస్ట్రార్
సి.కె.ఎమ్. కళాశాల, వరంగల్, ప్రిన్సిపాల్
పాఠశాల, కళాశాల స్థాయిలో అధ్యాపకులు

తెలిసిన భాషలు : తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ, హింది

విదేశీ పర్యటనలు : అమెరికా, కెనడా, యునైటెడ్ కింగ్‌డమ్

తెలంగాణ ఉద్యమ ప్రచురణలు :

తెలంగాణాలో ఏమి జరుగుతోంది
తెలంగాణ సమస్య : కొన్ని ప్రశ్నలు, వాటికి జవాబులు
జీ.వో. 610 : పునరావృతమవుతున్న చరిత్ర
తెలంగాణ రాష్ట్రం : ఒక డిమాండ్
తెలంగాణ రాష్ట్రంపై విస్తృత అంగీకారం : నిజానిజాలు
తల్లడిల్లుతున్న తెలంగాణ (సహ సంపాదకులు)
తెలంగాణ : ద డిమాండ్ ఫర్ ఎ సెపరేట్ స్టేట్ (సహ రచయిత)

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశ పునర్నిర్మాణం కోసం, సామాజిక న్యాయం కోసం రాజకీయ ప్రక్రియలో బడుగు, బలహీన వర్గాలకు న్యాయమైన వాటా కోసం రచించిన వ్యూహాలపై, నిర్దేశించిన విధానాలపై చెరగని ముద్రవేసిన మహనీయుడుడాక్టర్ బి.ఆర్. అంబేద్కర్. ఈ దేశానికి ఒక సమగ్రమైన రాజ్యాంగాన్ని అందించిన మహానుభావుడు కూడా ఆయనే. కానీ అంబేద్కర్ ప్రతిష్టను, ఔన్నత్యాన్ని అంతవరకే పరిమితం చేయడం న్యాయం కాదు. అంబేద్కర్‌ది ఒక సమగ్రమైన వ్యక్తిత్వం. ఆయన ఒక అసమాన మేధావి. ఆయన తపనంతా దేశ సమగ్రతపై, జాతి ఔన్నత్యంపై కేంద్రీకృతమై ఉండేది. అంబేద్కర్ చనిపోయి అర్ధశతాబ్ది దాటినా, ఈనాటికీ అసంఖ్యాక భారత ప్రజలు ఆయన జయంతులు, వర్ధంతులు జరుపుకుంటున్నారంటే, ఇప్పటికీ అంబేద్కర్ చెప్పిన విషయాలు ఎంత సమకాలీనంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

భారతదేశ భవితవ్యానికి సంబంధించిన అనేక విషయాల గురించి అంబేద్కర్ ఆలోచించాడు, విశ్లేషించాడు, ఆచరించాడు. దేశంలోని రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ స్వరూప స్వభావాలు ఎలా ఉండాలో విస్తృతంగా వివరించాడు. యాభై ఏళ్ళ క్రితం ఆయన చేసిన విశ్లేషణలను, వెలిబుచ్చిన అభిప్రాయాలను నాటి పాలకులు అర్థం చేసుకుని వుంటే, ఆయన సూచించిన పద్ధతిలో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ జరిగి వుంటే, ఈ రోజు మనం ఎదుర్కొంటున్న సమస్యలు బహుశ ఉండేవి కావు. ఈ సమస్యలు పరిష్కరించాలంటే

మళ్ళీ ఒకసారి అంబేద్కర్ చెప్పిన విషయాలను గుర్తుచేసుకోవడం అవసరం. దీని కొరకు చరిత్ర పుటలలోకి ఒకసారి తొంగిచూడాలి.

భారతదేశంలో చిన్న రాష్ట్రాల గురించి అంబేద్కర్ వెలిబుచ్చిన అభిప్రాయాలపై ప్రసంగించవలసిందిగా నన్ను కోరినందుకు డా॥బి.ఆర్. అంబేద్కర్ మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులకు నా హృదయ పూర్వక కృతజ్ఞతలు. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణతో ముడిపడిన తెలంగాణ సమస్యతో జీవితాన్ని పెనవేసుకున్న ఒక కార్యకర్తని నేను. అంబేద్కర్ సూచించిన పద్ధతిలోనే తెలంగాణ సమస్యకు, రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణలో ఉత్పన్నమైన ఇతర సమస్యలకు అర్థవంతమైన పరిష్కారాలుంటాయని విశ్వసించే వ్యక్తిని నేను.

ఇక అసలు విషయానికి వస్తే ఈ ప్రసంగంలో రెండు ప్రధాన పార్శ్వాలుంటాయి. ఒకటి : రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణపై అంబేద్కర్ అభిప్రాయాలు; రెండు : నడుస్తున్న చరిత్ర ఎదుర్కొంటున్న సమస్యలు. ఈ రెండింటినీ సమన్వయపరుస్తూ విశ్లేషించినప్పుడే ఈ ఉపన్యాసం సమగ్రంగా ఉంటుంది. ఈనాటి సమస్యల గురించి చర్చించినపుడు, అర్ధశతాబ్దికి పైగా నలుగుతున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సమస్య ప్రస్తావన అనివార్యం అవుతుంది. ప్రత్యేక రాష్ట్ర నినాదం దోపిడీకి, వివక్షకి పాలుపడుతున్న వ్యవస్థకు వ్యతిరేకంగా కొనసాగుతున్న ఉద్యమమే కానీ, ఇతర ప్రాంతాల సామాన్య ప్రజానీకానికి వ్యతిరేకం కాదు. నిజానికి తెలంగాణా ప్రాంతం ఉమ్మడి రాష్ట్రంలో ఎదుర్కొంటున్న సమస్యలకు ఇతర ప్రాంత ప్రజలు

కారణం కాదు. అసలు అక్కడి ప్రజలకు ఇక్కడి సమస్యలు తెలియవు కూడా. ఈ పరిస్థితికి ప్రధాన కారణాలు ఈ రాష్ట్రంలోని పాలకవర్గాలు, వాటిని ప్రభావితం చేస్తున్న సంపన్న వర్గాలు, వారికి వత్తాసు పలుకుతున్న ప్రసార మాధ్యమాలు అని మనవి చేస్తున్నాను.

భారతదేశ రాష్ట్రాల స్వరూపం గురించి అంబేద్కర్‌కు చాలా స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. వాటిలో అన్నిటికంటే ప్రధానమైనది భాషా ప్రాతిపదికన రాష్ట్రాలను స్థాపించడం శ్రేయస్కరం కాదు. అయినా భాషాప్రాతిపదికన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ అనివార్యం. పైకి చూస్తే ఈ రెండింటికి మధ్యా వైరుధ్యం ఉన్నట్టు కనిపిస్తుంది. కానీ లోతుగా విశ్లేషిస్తే అది వైరుధ్యం కాదని తెలుస్తుంది. శ్రేయస్కరం కాని ఇటువంటి విభజన అనివార్యమైనపుడు కొన్ని కట్టుదిట్టాలు, జాగ్రత్తలు (Checks and balances) పాటించవలసి ఉంటుందని నొక్కి వక్కాణించాడు అంబేద్కర్.

కేవలం భాషా ప్రాతిపదికపైననే రాష్ట్రాల నిర్మాణం జరగడం శ్రేయస్కరం కాదని అంటూ అంబేద్కర్ తన వాదనను ఈవిధంగా వివరించాడు. ప్రతి భాషకి దేశంలో ఒకే రాష్ట్రం ఉంటే, ఆ రాష్ట్రంలో ఉండే ప్రజానీకానికి వారి భాష పట్ల, సంస్కృతి పట్ల, ప్రాంతం పట్ల అభిమానం పెరిగి పెరిగి చివరికి అది ఒక దురభిమానంగా మారే ప్రమాదముంటుంది. ఈ దురభిమానం, వేరొక ప్రత్యేక జాతికి చెందినవారన్న భావనను కల్పించే అవకాశం ఉంటుంది. వారొక ప్రత్యేక జాతిగా గుర్తింపబడాలన్న కోరిక చివరికి దేశ విచ్ఛిత్తికి దారి తీస్తుంది. కనుకనే కేవలం భాషా ప్రాతిపదికన రాష్ట్రాల

పునర్వ్యవస్థీకరణ వాంఛనీయం కాదు. అయినా భాష ఒక ప్రాతిపదిక కావడం అనివార్యం. దానికి కారణం ఒక రాష్ట్రంలో ఒకటికంటే ఎక్కువ భాషలు మాట్లాడే వాళ్ళున్నప్పుడు కొందరు అధిక సంఖ్యాలో ఉండ వచ్చు, మరి కొందరు అల్పసంఖ్యలో ఉండవచ్చు. ఒకే రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఒక వర్గం, అల్పసంఖ్యలో మరికొన్ని వర్గాలున్నప్పుడు, అధిక సంఖ్యాకుల పెత్తందారీతనం అల్పసంఖ్యాకులను అణచివేతకు గురిచేస్తుంది. ఈ పరిస్థితులు వారిద్దరి మధ్య స్పర్ధలకు, ఘర్షణలకు దారితీస్తాయి.

భారతదేశంలో ఒక భాష మాట్లాడేవారికి ఒకటికంటే ఎక్కువ రాష్ట్రాలుండాలి. ఈ నేపథ్యంలో పెద్ద రాష్ట్రాలు, చిన్న రాష్ట్రాలు అనే భావనను అంబేడ్కర్ స్పష్టంగా విపులీకరించాడు. ఒక భాషకు ఒకే రాష్ట్రం అనే ప్రతిపాదన ఎంత ప్రమాదకరమో వివరించాడు. ఒకవేళ హిందీ మాట్లాడే వాళ్ళందరికీ ఒకే రాష్ట్రంఉంటే ,ఉత్తర భారతదేశంలో ఉండే రాష్ట్రాలకు, అక్కడి ప్రజానీకానికి దేశ రాజకీయ, ఆర్థిక వ్యవహారాలపై ఆధిపత్యం ఏర్పడుతుంది. దక్షిణ భారతదేశంలో అనేక భాషలు మాట్లాడే వారున్నారు కనుక అక్కడ అనేక చిన్న రాష్ట్రాలు ఏర్పడుతాయి. ఈ చిన్న రాష్ట్రాలపై పెద్ద రాష్ట్రాల ఆధిపత్యం, అణచివేత ఉంటుంది. దీనివలన ఉత్తర ,దక్షిణ ప్రాంతాల మధ్య ఘర్షణలు తలెత్తి దేశ సమగ్రతకే భంగం కలుగుతుంది. కనుకనే అతి పెద్ద రాష్ట్రాలు లేదా అతి చిన్న రాష్ట్రాలు ఉండడం శ్రేయస్కరం కాదని అంబేడ్కర్ స్పష్టం చేశాడు. ఈ కారణంగానే ఉత్తర ప్రదేశ్‌ను మూడు రాష్ట్రాలుగా, బీహార్‌ను రెండు రాష్ట్రాలుగా, మధ్యప్రదేశ్‌ను

రెండు రాష్ట్రాలుగా చేయాలని సూచించాడు. అదేవిధంగా దక్షిణ భారతదేశంలో అనేక రాష్ట్రాలు ఉండాలని అభిప్రాయపడ్డాడు. వీటన్నింటికీ ప్రాతిపదిక - ఒక రాష్ట్రానికి ఒకే భాష, కానీ ఒక భాషకు ఒకటి కంటే ఎక్కువ రాష్ట్రాలు. భారతదేశపు రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కొరకు అంబేడ్కర్ సూచించిన ప్రాతిపదికలలో ఇది అత్యంత మౌలికమైనది.

ఫజల్ అలీ అధ్యక్షతన, నియమించబడిన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సంఘం చేసిన సిఫార్సులలో కొన్నింటితో అంబేడ్కర్ ఏకీభవించకపోయినా, భాషా ప్రాతిపదిక మీద ఆయనకున్న అభిప్రాయాలకు, ఫజల్ అలీ కమీషన్ వెలిబుచ్చిన అభిప్రాయాలకు చాలా సారూప్యం కనపడుతుంది. ఒక భాషకు ఒకే రాష్ట్రాన్ని ఏర్పాటుచేయడం కానీ, అదేవిధంగా ఒక రాష్ట్రాన్ని ఒకే భాషకు పరిమితం చేయడం కానీ సాధ్యం కాదు, వాంఛనీయమూ కాదు అని ఫజల్ అలీ కమీషన్ తన నివేదిక ఉపోద్ఘాతంలోనే స్పష్టం చేసింది. ఈ ప్రాతిపదిక పైననే కమీషన్ చేసిన సిఫార్సులలో, ఒకే భాష మాట్లాడే రాష్ట్రాలు (unilingual), రెండు భాషలు మాట్లాడే రాష్ట్రాలు (Bilingual), అనేక భాషలు మాట్లాడే రాష్ట్రాలు (Multi-lingual) ఉన్నాయి. ఉదాహరణకు ఒకే భాష మాట్లాడే వాటిలో అనేక హిందీ రాష్ట్రాలు, రెండు భాషలు మాట్లాడే వాటిలో ఆనాటి పంజాబ్, బొంబాయి రాష్ట్రాలు, అనేక భాషలు మాట్లాడే వాటిలో ఈశాన్య భారత ప్రాంతాలు వస్తాయి. అదేవిధంగా ఒక భాషకు ఒకటికన్నా ఎక్కువ రాష్ట్రాలను సూచించినపుడు హిందీ మాట్లాడే

వారికే కాక, తెలుగు మాట్లాడేవారికి రెండు రాష్ట్రాలు (ఆంధ్ర - తెలంగాణ), మరాఠీ మాట్లాడేవారికి రెండు రాష్ట్రాలు (బొంబాయి - విదర్భ) ఉండాలని సిఫార్సు చేసింది. కానీ కమీషన్ చేసిన సిఫార్సులు ఒకటైతే, కేంద్ర ప్రభుత్వం అమలుచేసింది మరొకటి. చివరికి నాటి భారత ప్రభుత్వం అంబేడ్కర్ సూచనలనూ పాటించ లేదు. ఫజల్ అలీ కమీషన్ సిఫార్సులనూ అమలు చేయలేదు. అందుకే రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన సమస్యలు దేశంలో అనేక ప్రాంతాలలో ఇంకా తలెత్తుతూనే ఉన్నాయి.

ఇకపోతే చిన్న రాష్ట్రం లేక పెద్ద రాష్ట్రం అంటే ఏమిటి? నాకు తెలిసినంతవరకు, ఈనాటికీ దీనికొక నిర్దిష్టమైన నిర్వచనమూ లేదు, నిర్ధిష్టమైన కొలమానమూ లేదు. వాడుకలో ఒకటి చిన్న రాష్ట్రం, మరొకటి పెద్ద రాష్ట్రం అన్నప్పుడు, అది కేవలం సాపేక్షికమే. ఏదో ఒకదానితో తులనాత్మకంగా పోలిస్తే తప్ప, అది పెద్దదో లేక చిన్నదో అనే తారతమ్యానికి అర్థం ఉండదు. భారత దేశంలో ఈనాడు 28 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాలు ఉన్నాయి. ఈ 28 రాష్ట్రాలలో అన్నిటికంటే చిన్న రాష్ట్రం సిక్కిం. 2001 జనాభా లెక్కల ప్రకారం సిక్కిం జనాభా 4.5 లక్షలు, అంటే హైదరాబాద్ నగర జనాభాలో పదవ వంతు. అదీ రాష్ట్రమే. సిక్కింతో పోల్చినపుడు దేశంలో ఉన్న మిగతా 27 రాష్ట్రాలూ పెద్దవే. అదేవిధంగా ఇంకోవైపు నుంచి మొదలుపెడితే ఉత్తరప్రదేశ్ అన్నింటికంటే పెద్ద రాష్ట్రం. ఆ రాష్ట్ర జనాభా 16.5 కోట్లు. ఇది ప్రపంచంలోని అనేక దేశాలకంటే పెద్దది. ఈవిధంగా ఉత్తరప్రదేశ్‌తో పోల్చినపుడు మిగతా 27 రాష్ట్రాలు

చిన్నవి. అయితే, ఈ రెండు వైపరీత్యాలను వదిలిపెట్టిఎక్కడ మొదలుపెడితే వాస్తవ పరిస్థితి అర్థమవుతుంది? ఇక్కడే అంబేడ్కర్ సూచించిన తులనాత్మక పద్ధతి శాస్త్రీయంగా ఉంటుంది.

రాష్ట్రాల స్వరూప స్వభావాలలో సమతౌల్యం ఉండాలని అంబేడ్కర్ అభిప్రాయపడ్డాడు. దీనికి ఆయన మూడు కొలమానాలను ప్రతిపాదించాడు. ఒకటి జనాభా, రెండవది భౌగోళిక విస్తీర్ణం, మూడవది ఆర్థిక స్వావలంబనం. ఈ మూడింటిలో ఆర్థిక ప్రాతిపదికకు ఆయన అధిక ప్రాధాన్యతనిచ్చాడు. జనాభా, భౌగోళిక విస్తీర్ణం గురించి ఖచ్చితంగా చెప్పడం కష్టం అంటూనే, ఆనాటి జనాభా ప్రాతిపదికగా 2 కోట్లకు దరిదాపుల్లో జనాభా ఉన్న ఒక ప్రాంతాన్ని ఒక రాష్ట్రంగా చేయాలని సూచించాడు. ఈ విశ్లేషణకు అటు సిక్కింగానీ, ఇటు ఉత్తరప్రదేశ్‌ను కానీ కేంద్ర బిందువుగా తీసుకోవడం హాస్యాస్పదంగా ఉంటుంది. అయితే, దేనిని కేంద్ర బిందువుగా ఈ విశ్లేషణ కొరకు తీసుకోవాలనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. సమకాలీన రాజకీయ పరిస్థితిలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర వాదన ఒక ప్రధాన అంశమై కేంద్ర బిందువుగా నిలిచింది. కనుక తెలంగాణతో పోల్చినపుడు ఈ దేశంలో ఉన్న ఎన్ని రాష్ట్రాలు పెద్దవి, ఎన్ని రాష్ట్రాలు చిన్నవి అనే విశ్లేషణ అర్థవంతమూ, అనివార్యమూ అవుతుంది.

తెలంగాణను కేంద్ర బిందువుగా చేసుకుని విశ్లేషించినపుడు తెలిసే వాస్తవాలు ఆసక్తికరంగాఉంటాయి. దేశంలో ఇప్పుడున్న 28 రాష్ట్రాలలో 16 రాష్ట్రాలు తెలంగాణ కంటే చిన్నవి. ఈశాన్య

ప్రాంతంలో ఉన్న అస్సాం, మణిపూర్, మిజోరం, నాగాలాండ్, మేఘాలయ, త్రిపుర, అరుణాచలప్రదేశ్,సిక్కింతో పాటు జమ్ము కాశ్మీర్, పంజాబ్, హర్యానా, హిమాచలప్రదేశ్, గోవా, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్ కూడా తెలంగాణ కంటే చిన్నవి. ఈ 16 రాష్ట్రాలు భౌగోళిక విస్తీర్ణం, జనాభా ప్రాతిపదికల దృష్ట్యా తెలంగాణ కంటే చిన్నవి. ఇవి గాక భౌగోళిక విస్తీర్ణంలో పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాలు కూడా తెలంగాణ కంటే చిన్నవి. కనుక తెలంగాణను ఒక చిన్న రాష్ట్రం అనడం అర్ధరహితం, వాస్తవ విరుద్ధం. నిజానికి అంబేడ్కర్ సూచించిన శాస్త్రీయ ప్రాతిపదికలు తెలంగాణ రాష్ట్రానికి సరిగ్గా వర్తిస్తాయి.

అంబేడ్కర్ సూచించిన మరో ప్రాతిపదిక ఆర్థిక స్వావలంబన. ఈ రోజు తెలంగాణ గురించి జరుగుతున్న చర్చ ఆర్థిక స్వావలంబన అనే అంశం చుట్టే పరిభ్రమిస్తున్నది. ఒక ప్రాంతం లేక రాష్ట్రం లేక దేశం యొక్క ఆర్థిక స్వావలంబన ప్రధానంగా మూడు అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఒకటి : ప్రకృతి ప్రసాదించిన వనరులు; రెండు : మానవ ప్రయత్నంతో కల్పించుకున్న వసతులు; మూడు: ప్రకృతి వనరులు, మానవ కల్పిత వసతుల వల్ల లభించే ఆదాయం. ఈ కొలమానాలతో చూసినపుడు తెలంగాణ ప్రాంతం ఆర్థిక స్వావలంబన కల రాష్ట్రంగా మనగలుగుతుందా? అని విశ్లేషించడం అవసరం.

ముందుగా ప్రకృతి ప్రసాదించిన వనరుల సంగతి చూద్దాం. ఈ విషయంలో దేశంలోని అనేక రాష్ట్రాల కంటే తెలంగాణ చాలా

సంపన్నమైన ప్రాంతం. దక్షిణ భారతదేశంలోని రెండు అతి పెద్ద జీవ నదులైన కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల మధ్య ఉన్నది తెలంగాణ. కృష్ణా నదికి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పరీవాహక ప్రాంతంలో 68.5% తెలంగాణలో ఉన్నది. ఈ పరీవాహక ప్రాంతంలో సేద్యానికి యోగ్యంగా ఉన్న భూమిలో 70% తెలంగాణలోనే ఉన్నది. అదేవిధంగా గోదావరికి రాష్ట్రంలో ఉన్న పరీవాహక ప్రాంతంలో 79% తెలంగాణలో ఉన్నది. ఈ పరీవాహక ప్రాంతంలో సేద్యానికి యోగ్యమైన భూమిలో 70% ఈ ప్రాంతంలోనే ఉన్నది. ఈ భౌగోళిక వాస్తవం దృష్ట్యా కృష్ణా, గోదావరి నదీ జలాల్లో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన నీటిలో తెలంగాణకు ఎంత వాటా రావాలి? ఒకవేళ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఉంటే ఎంతవాటా వచ్చి ఉండేది? కృష్ణానదీ పరీవాహక రాష్ట్రాలయిన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య ఏ ప్రాతిపాదికన ఈ నీటిని పంచినారో, తెలంగాణకు కూడా అదే ప్రాతిపదికన ఆ నీటిలో వాటా లభించి ఉండేది. బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం కృష్ణా నదీ జలాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, 811 శత కోటి ఘనపుటడుగుల (టి.ఎం.సి) నీరు కేటాయించబడింది. అయితే ఇందులో తెలంగాణ ప్రాంతానికి ఎంత నీరు లభిస్తున్నది? కృష్ణా పరీవాహక ప్రాంతాన్ని ఆధారంగా తీసుకున్నా అందులో సేద్యానికి యోగ్యంగా ఉన్న భూమి విస్తీర్ణాన్ని పరిగణనలోనికి తీసుకున్నా 811 టి.ఎం.సిలలో దాదాపు 70% నీరు తెలంగాణకే చెందాలి. ఇక వర్షపాతం, భూగర్భ జలాల స్థాయి, వెనుకబాటుతనం మొదలగు వాటిని ఆధారంగా తీసుకుంటే మరింత ఎక్కువ నీరు

రావాలి. అయితే, ఈ 811 టీ.ఎం.సిలలో తెలంగాణ ప్రాంతంలో వినియోగించే నీరు ఏనాడూ 100 టీ.ఎం.సిలు దాటలేదు. ఇక గోదావరి విషయానికి వస్తే ట్రిబ్యూనల్ తీర్పు ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు 1480 టీ.ఎం.సిల నీరు కేటాయించడమైనది. అందులో రాష్ట్రంలో ఇంతవరకు వాడుకలోకి వచ్చింది సగం మాత్రమే. ఇందులో అధిక భాగం కాటన్ బరాజ్ ద్వారా కోస్తా ఆంధ్రలో వాడబడుతున్నది. ఇంకా పూర్తికానటువంటి శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణకు దక్కిన నీరు చాలా తక్కువ. వినియోగంలోకి రాని నీరు ఇంకా 740 టి.ఎం.సిలు ఉన్నప్పటికీ, శ్రీరామ్‌సాగర్ నుండి ధవళేశ్వరం దాకా గోదావరి నదిపై ఒక్క ఆనకట్ట కూడా లేదు. తెలంగాణ ప్రాంతంలో నాలుగైదు చోట్ల ఆనకట్టలు కట్టి నీటి సరఫరా చేస్తే, ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుంది. కానీ ప్రభుత్వం తెలంగాణ ప్రాజెక్టులను కాదని, ఆంధ్ర ప్రాంతానికి మాత్రమే లాభం చేకూర్చే పోలవరం నిర్మాణానికి పూనుకున్నది. అంతేకాక, గోదావరి నదిని కృష్ణాతో అనుసంధానం చేసి, మిగిలిన నీటిని ఇదివరకే అభివృద్ధి చెందిన ఆంధ్ర ప్రాంతానికి మళ్ళించే ప్రణాళికలు చేసింది. దీనివలన తెలంగాణ ప్రాంతానికి 100 టి.ఎం.సిల నీటి కంటే ఎక్కువ నీరు మిగలక పోవచ్చు.

పరిస్థితులు ఇలా ఉన్నాయి కనుకనే తెలంగాణ ప్రజలు కృష్ణా, గోదావరి జలాల్లో తమ వాటా ఎంతో తేల్చమంటున్నారు. ఇతర ప్రాంతాలకు చెందవలసిన నీటి వాటాలో ఒక్క చుక్క కూడా వారు అడగడం లేదు. ఈ ప్రాంతానికి న్యాయబద్ధంగా రావలసిన వాటాను మాత్రమే కేటాయించమంటున్నారు. దీనికొరకు దేశంలో

ఇదివరకే ఆచరణలో ఉన్న ప్రాతిపదికలను ఆధారంగా తీసుకోమంటున్నారు. నదీ పరీవాహక ప్రాంతాల విస్తీర్ణం, సేద్య యోగ్యమైన భూమి, వర్షపాతం, భూగర్భ జలాల స్థాయి, వెనుకబాటుతనంతో పాటు, రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం విధించిన నియమ నిబంధనలు మొదలగువాటినన్నింటినీ ఆధారంగా చేసుకుని పారదర్శకంగా నీళ్ళ కేటాయింపు చేసి,ప్రాజెక్టు నిర్మాణంలో ప్రాధాన్యతా క్రమాలను నిర్ణయించాలని మాత్రమే తెలంగాణ ప్రజలు కోరుతున్నారు. కాని ప్రభుత్వాలు కాదంటున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ఏ పార్టీ ప్రతిపక్షంలో కూర్చున్నా, ఏ పార్టీలు పాలకపక్షాలకు మిత్రపక్షాలుగా వ్యవహరించినా, ఏ ప్రాంతపు వ్యక్తి ముఖ్యమంత్రి అయినా ఇదే కథ నడుస్తున్నది. కనుకనే ఉమ్మడి రాష్ట్రంలో నదీ జలాలలో న్యాయబద్ధమైన వాటా లభ్యం కానపుడు, ప్రత్యేక రాష్ట్రంలో అది సాధ్యమైనపుడు ఈ ప్రాంత ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరడంలో అనౌచిత్యమేమున్నది. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ ప్రాంతానికి న్యాయబద్ధంగా రావలసిన వాటా వస్తే ఒక కోటి ఎకరాలు సస్యశ్యామల మవుతాయి. ప్రతి గ్రామానికి తాగునీరు అందుతుంది. ఈ విషయాన్ని ఇంతవివరంగా ఎందుకు చెప్పవలసి వస్తుందంటే, ఈనాటి చర్చంతా ప్రధానంగా నదీ జలాలపైనే కేంద్రీకృతమై ఉన్నది. ఇది చివరికి రాష్ట్ర భవిష్యత్తును నియంత్రించే దశకు చేరుకుంది.

నీటితో పాటు దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద బొగ్గు గని కేవలం తెలంగాణలోనే వుంది. అటవీ సంపదలో 47% పైగా ఈ

ప్రాంతంలోనే లభ్యమవుతుంది. సున్నపు రాయి, గ్రానైటు వంటి ఖనిజ సంపద ఇక్కడే విస్తారంగా ఉంది. ఈ ప్రాంతానికి ప్రకృతి ప్రసాదించిన ఈ అపార సంపదలు ఈ ప్రాంత అభివృద్ధి కొరకు వినియోగిస్తే, దేశంలో అభివృద్ధి చెందిన ఇతర రాష్ట్రాలకంటే తెలంగాణ చాలా ముందుంటుంది.

ఆర్థిక స్వావలంబనకు కావలసిన మరొక అంశం మానవ ప్రయత్నంతో కల్పించిన వసతులు. చెరువులు, కుంటలు, రవాణా సౌకర్యాలు, విద్యాసంస్థలు, ఆరోగ్య సంస్థలు, పరిశ్రమలు మొదలైనవి వీటికిందికి వస్తాయి. మొదట తెలంగాణలో చెరువులు, కుంటల పరిస్థితి ఏమిటో చూద్దాం. ఆంధ్రప్రదేశ్ ఏర్పడే నాటికే ఈ ప్రాంతంలో ఒక పటిష్టమైన నీటి పారుదల వ్యవస్థ ఉండేది. దాన్ని గొలుసు చెరువుల వ్యవస్థ అంటారు. ఈ వ్యవస్థ కింద 1956 నాటికే 12 1/2 లక్షల ఎకరాలకు సాగునీరు అందేది. ఈ గణాంకాలు ప్రభుత్వమే ప్రచురించిన వాస్తవాలు. గత యాభై ఏళ్ళ సమైక్యాంధ్రలో చిన్న నీటి పారుదలపై ప్రభుత్వాలు కొన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. దాని ఫలితంగా చెరువుల కింద సాగయ్యే భూమి విస్తీర్ణం పెరగాలి కదా! కనీసం స్థిరంగానైనా ఉండాలి కదా ! కాని అది 2 1/2 లక్షల ఎకరాలకు పడిపోయింది. ఎందుకు? తెగిపోయిన చెరువులను, కుంటలను మరమ్మత్తు చేయలేదు. పేరుకుపోయిన ఇసుక మేటలను తీయలేదు. ఉపయోగంలో ఉన్న అనేక చెరువులను ఉద్దేశపూర్వకంగా శిథిలం చేశారు. పట్టణీకరణ పేరుతో చెరువులను మట్టితో నింపి, ఇళ్ళ స్థలాలుగా మార్చినారు.

కొన్ని చెరువులు అక్రమ కబ్జాలకు గురి అయినాయి. ఈ విధంగా చిన్నకారు, సన్నకారు రైతులు నిర్వాసితులు అయిపోయారు. వారు తమ భూములను తక్కువ ధరకు అమ్ముకోవడమో, లేదా విధిలేక వదిలేసి అడవిపాలు కావడమో జరిగింది. అటువంటి ప్రాంతాలన్నీ కోస్తా ఆంధ్ర నుంచి వచ్చిన పెట్టుబడిదారుల కైవసమై పోయాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా పెరిగింది. కాకతీయుల కాలంలో నుంచీ, నిజాంషాహిల ఫ్యూడల్ వ్యవస్థ వరకు, చిన్న నీటి పారుదల వసతుల కల్పనపై నాటి పాలకులకు ఉన్న శ్రద్ధ, ఒక ప్రజాస్వామిక వ్యవస్థలో, ప్రజాప్రతినిధులైన పాలకులు చూపలేదు.

ఇక రవాణా సౌకర్యాలకు వస్తే, ఈ రోజు తెలంగాణా ప్రాంతంలో ఉన్న రైల్వే లైన్లలో దాదాపు అన్నీ నిజాం రాజు వేయించినవే. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత ఈ ప్రాంతంలో వేసిన రైల్వే లైన్లు రెండే. ఒకటి : బీబీనగర్ నుండి నడికుడి వరకు. దీనివలన తెలంగాణ ప్రాంతానికి ఒరిగిందేమీ లేదు. రాష్ట్ర రాజధాని నుండి కోస్తా ఆంధ్రకు పోయివచ్చే ఆంధ్ర ప్రయాణీకులకు మాత్రమే ఇది అదనపు సౌకర్యం. రెండవది : పెద్దపల్లి నుండి కరీంనగర్ వరకు వేసిన కొత్తరైలు. ఇది నిజానికి ఒక జోక్‌గా మిగిలిపోయింది.

తరువాత, పరిశ్రమల సంగతి చూద్దాం. వరంగల్‌లో నిజాం నవాబు స్థాపించిన ఆజంజాహి మిల్లు, ఆ కాలంలో ఆసియాలోనే అతిపెద్ద బట్టల మిల్లు. అది ఉమ్మడి రాష్ట్రంలో మూతపడి పోయింది. యంత్రసామాగ్రిని తుక్కుగా అమ్మేసినారు. ఇక స్థలాన్ని

ఆంధ్రప్రాంత పెట్టుబడిదారుల హస్తగతం చేసే కుట్రలు జరుగుతున్నాయి. అదేవిధంగా బోధన్‌లో నిజాం ఏర్పాటు చేసిన చక్కెర కర్మాగారం ఆనాడు ఆసియా ఖండంలోనే అతిపెద్ద చక్కెర ఫ్యాక్టరీ. లాభాలలో నడుస్తున్న ఆ పరిశ్రమ ఎన్.టి.రామారావు వివక్షాపూరిత విధానాల వల్ల నష్టాల పాలైంది. నష్టాలను సాకుగా చూపి, దానిని కోస్తా ఆంధ్ర పెట్టుబడిదారులకు కారుచౌకగా అమ్మేశాడు చంద్రబాబునాయుడు. ఈ విధంగా హైదరాబాదు రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వారసత్వంలో లభించి తరువాత మూసివేయబడిన పరిశ్రమలు అనేకం ఉన్నాయి. అందులో ముఖ్యమైనవి సిర్‌పూర్‌లోని సిల్కుమిల్లు, అంతర్గామ్‌లోని జౌళి మిల్లు, హైదరాబాదులో రిపబ్లిక్ ఫోర్జ్,డి.బి.ఆర్ మిల్లు, ఆల్విన్, గ్లాసు ఫ్యాక్టరీ - ఇటువంటివి ఇంకా ఎన్నో!

పూర్వపు హైదరాబాదు రాష్ట్రంలో, ముఖ్యంగా ఏడవ నిజాం కాలంలో, ప్రజారోగ్యం కొరకు ప్రభుత్వం కల్పించిన వసతులు అద్వితీయమైనవి. హైదరాబాదు నగరంలో ఉన్న ప్రసిద్ధ ప్రభుత్వ ఆసుపత్రులన్నీ - ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, కాన్సర్, మెటర్నిటి, ఇఎన్టీ, చెస్ట్ డిసీజెస్, మెంటల్ డిసీజెస్, నిమ్స్- నిజాం కాలంలో స్థాపించినవే. ఈ రోజు ఆంధ్రప్రాంతపు పెట్టుబడిదారులు స్థాపించుకున్న కార్పోరేట్ ఆస్పత్రుల అభివృద్ధి కొరకు తెలంగాణ లోని ప్రభుత్వ ఆస్పత్రులు పాలకుల నిరాదరణకు గురియై, కనుమరుగయ్యే దశకు చేరుకున్నాయి. ఇక యునానీ, ఆయుర్వేద, హోమియో ఆస్పత్రులకు సమైఖ్యాంధ్రలో పట్టిన దుస్థితి చెప్పనలవి

కాదు. ఈ విధంగా ప్రకృతి ప్రసాదించిన వనరులలో ఈ ప్రాంతానికి రావలసిన న్యాయమైన వాటా రాలేదు. తెలంగాణ ప్రజలు చెమట, రక్తం ఓడ్చి రాష్ట్రం ఏర్పడకముందే కల్పించుకున్న వసతులు ఛిద్రమైపోయాయి.

ఇక రాష్ట్ర ఖజానాకు తెలంగాణా ప్రాంతం సమకూర్చే ఆదాయాన్ని గురించి తెలుసుకుందాం. నేను తెలిపే వివరాలు ప్రభుత్వం అధికారికంగా ప్రచురించిన డాక్యుమెంట్ను నుండి సేకరించినవే. ఉమ్మడి రాష్ట్రానికి సమకూరే ఆదాయంలో తెలంగాణ నుండి వస్తున్నది 50%నికి పైననే ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం విధించే పన్నులలో అమ్మకపు పన్ను, ఎక్సైజు వసూళ్లు ప్రధానమైనవి. అమ్మకపు పన్ను విషయంలో తెలంగాణ ప్రాంతంలో జరిగే వసూళ్ళు మొత్తం రాష్ట్రంలో చేసే వసూళ్ళలో 70% వరకు ఉంటాయి. అదేవిధంగా ఎక్సైజు వసూళ్లలో 65%నికి పైగా తెలంగాణ ప్రాంతంలోనే ఉంటాయి. రెండు: పన్నుల ద్వారా వసూలయ్యే మొత్తం, రాష్ట్రానికి వచ్చే మొత్తం ఆదాయంలో 45% వరకు ఉంటుంది. ఇవి కాక బొగ్గు గనులపైన వచ్చే సెస్సు మొత్తం ఈ ప్రాంతం నుండే వస్తుంది. ఇకపోతే రిజిస్ట్రేషన్ ఛార్జీలు కూడా తెలంగాణలోనే ఎక్కువ వసూలవుతాయి. వీటికి తోడు కేంద్రం విధించే ఆదాయం పన్ను, ఎక్సైజు డ్యూటీ వల్ల లభించే పన్నులలో రాష్ట్రానికి కూడా వాటా వుంటుంది. ఈ వాటాలను నిర్ణయించడానికి కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ళకొకసారి ఆర్థిక సంఘాన్ని నియమిస్తుంది. ఈ సంఘం పాటించవలసిన సూత్రాలను దేశ పార్లమెంటు

నిర్ణయిస్తుంది. కేంద్ర పభుత్వం విధించే పన్నులలో రాష్ట్రాల వాటాలు నిర్ధారించేటప్పుడు ఆర్థిక సంఘం పాటించవలసిన సూత్రాలలో అతి ముఖ్యమైనది, రాష్ట్రాలు లేక ఆ రాష్ట్రాలలోని ప్రాంతాల వెనుకబాటుతనం. వెనకబడిన ప్రాంతాలకు, రాష్ట్రాలకు పెద్ద మొత్తాలను ఈ సంఘం కేటాయిస్తుంది. కనుక తెలంగాణ ప్రాంతపు వెనుకబాటుతనాన్ని చూపి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ కేటాయింపుల్లో ఎక్కువ మొత్తాలను పొందుతుంది. కాని ఆ నిధులు వేరే చోట ఖర్చవుతాయి.

ఆదాయపు వివరాలు ఈ విధంగా ఉండగా, ప్రాంతాలవారీ ఖర్చుల వివరాలు ఏవిధంగా ఉన్నాయో చూద్దాం. ప్రభుత్వం చేసే ఖర్చుకు ఆదాయం,వెనుకబాటుతనం, జనాభా ప్రధాన ప్రాతిపదికలుగా ఉండాలి. రాష్ట్ర ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుంటే, రాష్ట్రం ప్రతి సంవత్సరం చేసే ఖర్చులో కనీసం 50% తెలంగాణలో ఉండాలి. వెనుకబాటుతనాన్ని దృష్టిలో ఉంచుకుంటే 50% కంటే ఎక్కువే తెలంగాణాకి చెందాలి. కేవలం జనాభాను మాత్రమే ఏకైక ప్రాతిపదికగా తీసుకున్నా కనీసం 42% తెలంగాణ కొరకు ఖర్చుపెట్టాలి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రాంతం కొరకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అంశాలపై చేస్తున్న ఖర్చు వివరాలను పరిశీలిద్దాం.

ప్రభుత్వం పెద్దఎత్తున ఖర్చు చేసే రంగాలలో నీటిపారుదల రంగం చాలా ముఖ్యమైనది. గత 50 ఏళ్ళలో భారీ నీటి పారుదల ప్రాజెక్టుల కొరకు పెట్టిన ఖర్చు ప్రాంతాలవారీగా ఏ నిష్పత్తిలోఉందో

చూద్దాం. అది ప్రాంతాల వారీగా అభివృద్ధి చెందిన ఆయకట్టుల నిష్పత్తిలో ఉంటుంది. ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రచురించే గణాంకాల ప్రకారం రాష్ట్రంలో భారీ నీటిపారుదల కింద సాగవుతున్న మొత్తం భూములలో కోస్తా జిల్లాల్లో 76%, రాయలసీమలో 9%, తెలంగాణలో 15% ఉంటుంది.అంటే ఏమిటి? ఈ యాభై సంవత్సరాల కాలంలో ఏ ప్రాంతంలో ఎంత ఆయకట్టు అభివృద్ధి అయిందన్న ప్రాతిపదిక మీద తీసుకుంటే, దాని కొరకు పెట్టిన ఖర్చులో తెలంగాణ ప్రాంతానికి కేవలం 15% మాత్రమే దక్కిందని స్పష్టమవుతున్నది.

విద్యారంగంలో ఖర్చు గురించి చూద్దాం. ఈ రంగంలో పెట్టే ఖర్చులో సింహభాగం సిబ్బంది జీతభత్యాల కొరకే పోతుంది. ప్రాథమిక విద్యారంగంలో ప్రభుత్వ యాజమాన్యం, ప్రభుత్వం నుండి గ్రాంటు పొందే ప్రైవేటు యాజమాన్యాలు నడిపే పాఠశాలల్లో పనిచేసే అధ్యాపకుల సంఖ్యలు పరిశీలిద్దాం. జనాభా ప్రాతిపదికపైన ఈ అధ్యాపకులలో కనీసం 42% తెలంగాణలో ఉండాలి. కాని అది ఏనాడూ 30% దాటలేదు. అంటే ప్రాథమిక విద్యపై ప్రభుత్వం పెట్టే ఖర్చులో 30% మాత్రమే తెలంగాణాకు దక్కుతున్నది. ఇక ఉన్నత విద్యారంగానికి వస్తే పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉంది. మచ్చుకు ప్రభుత్వం నుంచి ఎయిడ్ పొందే డిగ్రీ కళాశాలల విషయాన్ని ప్రస్తావిస్తాను. ఈ రాష్ట్రంలో డిగ్రీ కళాశాల స్థాయి విద్యావకాశాలు అధికంగా ప్రైవేటు రంగంలోనే కల్పించబడ్డాయి. అందులో చాలా కళాశాలలకు ప్రభుత్వం నుంచి గ్రాంటు లభిస్తుంది.

గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఎయిడెడ్ కళాశాలలకు విడుదల చేసిన గ్రాంటు వివరాలు చూస్తే తెలంగాణా ప్రాంతానికి ఎంత ఘోరమైన అన్యాయం జరుగుతోందో అవగతమౌతుంది. తెలంగాణా తొమ్మిది జిల్లాల్లో ఉన్న ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు విడుదల చేసిన గ్రాంటు మొత్తం, ఒక్క గుంటూరు జిల్లాలోని కాలేజీల గ్రాంటు కంటే చాలా తక్కువ.

ఈ వివరాలన్నీ కేవలం మచ్చుతునకలు మాత్రమే. ఏ రంగంలో చూసినా పరిస్థితి ఇదే విధంగానే కాకపోతే ఇంకా అధ్వాన్నంగా ఉంటుంది. ఈ అనుభవాల నేపథ్యంలో తెలంగాణ ప్రజలు అడుగుతున్నది ఏమిటో అర్థం చేసుకోవాలి. ఇతర ప్రాంతాల నుండి వచ్చే ఆదాయంలో వారికి వాటా కావాలని అడగడం లేదు. ఈ ప్రాంతపు ఆదాయం, వెనుకబాటుతనం, జనాభా ప్రాతిపదికన, ఈ ప్రాంతానికి కేటాయింపులు జరగాలని మాత్రమే అడుగుతున్నారు. ఈ వాస్తవాలను రాష్ట్ర ప్రభుత్వం దశాబ్దాల తరబడి పట్టించుకోకపోవడం వలననే నేటి సంక్షోభం తలెత్తింది.

ఇక ఉద్యోగ ,రంగానికి వస్తే, ప్రస్తుతం జీవో 610 కేంద్ర బిందువుగా పెద్ద చర్చ జరుగుతున్నది. ఆరు సూత్రాల పథకం, రాష్ట్రపతి ఉత్తర్వుల ఉల్లంఘన వలన తెలంగాణ యువతకు దక్కకుండా పోయిన ఉద్యోగాల సంఖ్య ఎంత? అది 60 వేలా, 80 వేలా లేక 2 లక్షలా అన్నప్పుడు భేదాభిప్రాయాలున్నా, అవి పెద్ద మొత్తంలోనే ఉంటాయన్నది నిర్వివాదాంశమని ప్రభుత్వం నియమించిన కమీషనే నిర్ధారించింది. శాఖల వారీ, జిల్లాల వారీ,

జోన్ల వారీ వివరాలను ఇప్పుడు ఉటంకించడం సాధ్యం కాదు. కనుక, కొట్టొచ్చినట్టు కనపడే కొన్ని వివరాలను ప్రస్తావిస్తాను. ఉదాహరణకు రాష్ట్ర సచివాలయాన్నే తీసుకుందాం. అది రాష్ట్ర పాలనకు దిశా నిర్దేశం చేసే బలమైన అధికార కేంద్రం. నేడు దాని సిబ్బందిలో దాదాపు 5500 మంది ఉద్యోగస్తులున్నారు. అందులో తెలంగాణవారు 500 కంటే తక్కువే ఉంటారు. అంటే 9% అన్నమాట! అందులో కూడా అధిక సంఖ్యాకులు అటెండర్లు, స్వీపర్లు, డ్రైవర్లు, లిఫ్ట్ ఆపరేటర్ల వంటి క్రింది స్థాయి ఉద్యోగులు. అదేవిధంగా నూటా ముప్ఫై నాలుగు రాష్ట్ర స్థాయి కార్యాలయ శాఖాధిపతుల్లో తెలంగాణ వారు 16% కూడా లేరు.

ఇక అక్షరాస్యత పరిస్థితి ఎట్లా ఉందో చూద్దాం. ఈ దేశంలోని 28 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాలతో పోల్చినపుడు, తెలంగాణ కింది నుండి 3వ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన ఇతర ప్రాంతాలతో పోల్చినా కూడా అక్షరాస్యతలో తెలంగాణ ప్రాంతం ఉత్తరాంధ్ర మరియు రాయలసీమ కంటే కూడా వెనుకబడి ఉంది. ఉత్తరాంధ్ర, రాయలసీమ కూడా వెనుకబడిన ప్రాంతాలే. ఇవి కూడా వివక్షకు గురిఅయిన మాట కూడా కొంతవరకు వాస్తవమే. కాని తెలంగాణ ప్రాంతం వివక్షతో పాటు దోపిడీకి కూడ గురి అయింది. ప్రకృతి వనరుల మళ్ళింపు, ఆర్థిక వనరుల తరలింపు, ఉద్యోగ అవకాశాల అపహరణ మొదలైన సమస్యలు ఆ ప్రాంతాలకు లేవు. అక్కడ దోచుకోవడానికి ఏమిలేదు, ఇక్కడ వుంది!

ఈ విషయాల్లో మా అభ్యంతరమంతా ఏమిటంటే ఇతర

ప్రాంతాలకు చెందవలసిన నదీ జలాల్లో ఒక్క చుక్క కూడా మాకవసరం లేదు. ఇతర ప్రాంతాల నుండి వచ్చే ఆదాయంలో ఒక్క పైసా కూడా మాకక్కర లేదు. ఇతర ప్రాంతాల వారికి చెందే ఉద్యోగాలలో ఒక్కటి కూడా మేం తీసుకోము. మేమడిగేదల్లా మా నీళ్ళు మాకివ్వండి. మా ఆదాయాన్ని మా కొరకు ఖర్చు పెట్టండి. మా ఉద్యోగ అవకాశాలు మా నిరుద్యోగ యువతకివ్వండి. ఇదే జరగడం లేదు.

తెలంగాణ సమస్య కేవలం ఆర్థిక సంబంధమైన సమస్య మాత్రమే కాదు. దీనికి ఒక రాజకీయ పార్శ్వం కూడా ఉంది. రాష్ట్ర రాజకీయాలలో ఈ ప్రాంతపు నాయకత్వం అంచులకు నెట్టివేయబడింది. దానివలన విధాన నిర్ణయాధికార ప్రక్రియలో ఈ ప్రాంతపు నాయకులకు అర్థవంతమైన పాత్ర లేకుండా పోయింది. ఈ పరిస్థితిని సరైన దృక్కోణంతో అర్థం చేసుకోవాలంటే వ్యవస్థలోని వైరుధ్యాల గురించి అంబేద్కర్ చేసిన సూత్రీకరణను తెలుసుకోవాలి. అదే అధిక సంఖ్యాకుల పెత్తందారీతనం, అల్ప సంఖ్యాకుల అణచివేత. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విధాన నిర్ణయ వ్యవస్థలో తెలంగాణ ప్రతినిధులు అల్ప సంఖ్యాకులు. కనుకనే 50 సంవత్సరాలు గడిచినా అధిక సంఖ్యాకులైన ఆంధ్ర ప్రతినిధులు తెలంగాణ నాయకత్వాన్ని ఎదగనివ్వలేదు. ఒకవేళ ఎదిగినా, నిలదొక్కుకోనీయలేదు. అర్థశతాబ్ది కాలం గడిచినా, తెలంగాణ ప్రాంతం నుంచి ముఖ్యమంత్రులైన వాళ్ళు ముగ్గురే -పి.వి.నరసింహారావు, డా॥ మర్రి చెన్నారెడ్డి, టి. అంజయ్య. ఈ

ముగ్గురిలో ఏ ఒక్కరు కూడా పూర్తికాలం పదవిలో ఉండలేకపోయారు. ఈ ముగ్గురు కలిసి ముక్కలు చెక్కలుగా, అప్పుడప్పుడు పదవిలో వున్న కాలాన్నంతా కలిపినా అది 5 1/2 సంవత్సరాలకంటే ఎక్కువ లేదు. ఇలా ఎందుకు జరిగింది? పి.వి. నరసింహారావుకి ఒక మేధావి అనే ప్రతిష్ట ఉంది. కావలసిన మెజారిటీ లేకపోయినా దేశ ప్రధానిగా నిరంతరాయంగా ఐదేళ్ళ పాటు కేంద్ర ప్రభుత్వాన్ని నడిపించగలిగాడు. కానీ అదే పి.వి., రాష్ట్ర అసెంబ్లీలో పూర్తి మెజారిటీతో ఉన్నా ముఖ్యమంత్రిగా 18 మాసాల కంటే ఎక్కువకాలం కొనసాగలేక పోయాడు. కారణం? తెలంగాణ ఉద్యోగులకు ఇచ్చిన రక్షణను కొనసాగించటానికి ఆనాటి ముల్కీ నిబంధనలు రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలుచేస్తానని పి.వి అన్నంత మాత్రాన, అధిక సంఖ్యలో ఉన్న ఆంధ్ర నాయకత్వం ఆయనని పదవీభ్రష్టుడిని చేసింది. అదే విధంగా చెన్నారెడ్డికి ఒక రాజకీయ ఉద్ధండుడు, పరిపాలనాదక్షుడు అనే గుర్తింపు ఉండేది. అతను కూడా రెండుసార్లు ముఖ్యమంత్రి అయినా, అంతా కలిపి 3 సంవత్సరాలు కూడా ఆ పదవిలో కొనసాగలేకపోయాడు. ఆయన్ని వదిలించుకోవడానికి అధిక సంఖ్యాకులైన ఆంధ్ర నాయకులు రాష్ట్రంలో మత కల్లోలాలు సృష్టించారు. అందులో ప్రధాన పాత్ర వహించింది వై.యస్. రాజశేఖర రెడ్డి అన్న విషయం జగద్విదితమే. అంజయ్య ముఖ్యమంత్రి పదవిలో అతి కష్టంగా 5,6 మాసాలు కొనసాగాడు. కొంతమంది వెంగళరావును కూడా తెలంగాణ వాడని అనుకుంటారు. అది వాస్తవం కాదు.

ఆయన మూలాలు తెలంగాణలో లేవు. కోస్తా ప్రాంతం నుండి వలస వచ్చిన వెంగళరావులో తెలంగాణా వ్యతిరేక వైఖరి ప్రస్ఫుటంగా కనపడేది. అంతేకాకుండా తెలంగాణ ప్రాంతపు వ్యక్తులు ముఖ్యమంత్రులైనప్పుడల్లా ఈ ప్రాంతానికి అధికంగా నష్టమైంది. ఈ విధంగా ఒక రాజకీయ వ్యవస్థలో అధిక సంఖ్యాకుల పెత్తందారీతనం కింద అల్పసంఖ్యాకులు నలిగిపోతారని అంబేడ్కర్ ఇచ్చిన విశ్లేషణకు తెలంగాణ పరిస్థితి ఒక స్పష్టమైన ఉదాహరణ.

తెలంగాణా సమస్యలో ఆర్థిక, రాజకీయ అంశాలతో పాటు సాంస్కృతిక అంశాలు కూడా ఇమిడి ఉన్నాయి. తెలంగాణ వైతాళికుడు ప్రజాకవి కాళోజి ఎప్పుడూ అనేవాడు " ఆర్థికంగా వెనుకబడిపోతే మళ్ళీ నిలదొక్కుకోవచ్చు, రాజకీయంగా నిర్లక్ష్యానికి గురిఅయితే మళ్ళీ తెప్పరిల్లుకోవచ్చు, కానీ సాంస్కృతిక గుర్తింపు చెరిగిపోతే అస్తిత్వాన్నే కోల్పోతాం". యాభై ఏళ్ళ సమైఖ్యాంధ్రలో తెలంగాణా భాషా సంస్కృతులు నిరాదరణ, అవహేళనకు గురి అయి కనుమరుగైపోతున్నాయి. చివరకు తెలంగాణ తన అస్తిత్వాన్నే కోల్పోయే దశకు చేరుకున్నది. ఈ విషయంలో కూడా అంబేద్కర్ సూత్రీకరణను అన్వయించుకోవాలి. "ఒక రాష్ట్రంలో రెండు భాషలు మాట్లాడే వాళ్ళుంటే, మెజారిటీ నిరంకుశత్వం వల్ల మైనారిటీ అణచివేతకు గురవుతుంది." ఈ తర్కాన్ని ఇంకా కాస్త విపులీకరిస్తే, ఒక రాష్ట్రంలో అందరు ఒకే భాష మాట్లాడుతున్నప్పటికీ, ఆ భాషలో మాండలిక వైవిధ్యాలు ప్రస్ఫుటంగా వుంటే, ఇక్కడ కూడా మెజారిటీ, మైనారిటీ సమస్య తలెత్తుతుంది. తెలంగాణలో సరిగ్గా అదే జరుగు

తున్నది. తెలంగాణ మాండలికం ఎంత తీవ్రమైన అవహేళనకు గురి అయిందో ప్రతి రోజూ సినిమాల్లో టి.వీలలో చూస్తూనే ఉంటాం.

తెలంగాణ వారు మాట్లాడే తెలుగు గురించి ఆంధ్రప్రాంతం వారికి కొన్ని విచిత్రమైన అభిప్రాయాలున్నాయి. ఇక్కడ మాట్లాడే తెలుగు అసలు తెలుగే కాదని కొందరు, కాకపోతే కల్తీ తెలుగు, నకిలీ తెలుగు, ఉర్దూ మయమయిన తెలుగని మరికొందరు అంటారు.ఈ సందర్భంగా ఒక సంఘటనను ప్రస్తావించడం ఉచితంగా ఉంటుందనుకుంటున్నాను. 1968-69లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఉధృతంగా నడుస్తున్నప్పుడు ఒక అనుభవం ఎదురైంది. ఆ రోజుల్లో జంధ్యాల పాపయ్య శాస్త్రి ఒక గేయంలో, ఒకవేళ ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే, అది దక్షిణ పాకిస్తానం అవుతుందని రాశాడు. అది అర్థం కాక నేను, ఇంకో మిత్రుడు ఆయన దగ్గరికి వెళ్ళి 'శాస్త్రి గారూ, మీ బాధేమిటని' అడిగాము. దానికి ఆయన సమాధానమిస్తూ ప్రత్యేక తెలంగాణలో తెలుగంతా భ్రష్టుపట్టిపోయి, అది పూర్తిగా తౌరక్యాంధ్రం అవుతుందని అన్నాడు. తౌరక్యాంధ్రం అంటే తురకలు మాట్లాడే ఉర్దూమయమయిన తెలుగు అని ఆయన వివరించాడు. దానికి మేము స్పందిస్తూ ఉర్దూ కేవలం తురకల భాషే కాదని, అది ఒక సంపన్నమైన, మధురమైన భారతీయ భాష అని చెప్పాము. అంతేకాక మతానికి భాష అవసరం కావచ్చు కానీ, భాషకు ఒక మతమంటూ ఉండదని అన్నాము. ఒకవేళ ఉర్దూ ముస్లింల భాషైతే, ఇంగ్లీషు ఏ మతం వారి భాష అవుతుంది? అది కేవలం క్రైస్తవుల భాషే అని అనగలమా?

అటువంటప్పుడు హిందువులది ఏ భాష అని చెప్పాలి? ఈ దేశంలో మాట్లాడే భాషలన్నీ హిందువుల భాషలు కావా? ఉర్దూ కూడా భారతదేశంలోనే పుట్టి, విస్తరించి అనేక భారతీయ భాషలను ప్రభావితం చేసి, వాటితో ప్రభావితమైన భాషే కదా! నిజానికి తెలంగాణ వారికంటే, ఆంధ్రప్రాంతం వారు మాట్లాడే తెలుగులోనే ఎక్కువ ఉర్దూ పదాలు ఉంటాయి అని పాపయ్య శాస్త్రి గారికి వివరించే ప్రయత్నం చేశాము. కానీఆయన నమ్మే పరిస్థితిలో లేరు. అప్పుడు ఒక తెలుగు దినపత్రికను తీసి మొదటి పేజీలో ఉన్న ఒక హెడ్‌లైను ఆయనకు చూపించాము. అది "నిజామాబాదు జైలు నుండి 5 గురు ఖైదీల పరారి" అని వుంది. ఇందులో జైలు, ఖైదీ, పరారీ, అన్నీ ఉర్దూ పదాలే. దానికి శాస్త్రిగారు "అట్లానా" అన్నారు. మా చర్చను కొనసాగిస్తూ, శాస్త్రిగారితో మీ కవిత్వంలో కూడా ఉర్దూ పదాలున్నాయి కదా అన్నాము. "ఎక్కడ"? అని ఆయన ఆశ్చర్యంగా అడిగాడు. అప్పుడు మేము పాపయ్యశాస్త్రి గారి రచనల నుండే కొన్ని ఉదాహరణలు చూపించాము. ఒక పద్యంలో "రాజాజీ మున్నగు పెద్దలకు మా రాష్ట్రమ్ము మాటంటేనే బేజారెత్తును గుండె" అని అన్నాడు. బేజారు అన్నది ఉర్దూ పదమే కదా! అదేవిధంగా విజయశ్రీలో జెండా, పంఖా అనే పదాలను వాడాడు. ఇవి కూడా ఉర్దూ పదాలే ! ఈ చర్చను మరింత కొనసాగిస్తూ మీరే కాదు, చాలా మంది ప్రసిద్ధ తెలుగు కవులు అనేక ఉర్దూ పదాలను వాడినారు. ఉదాహరణకు గుర్రం జాషువా "ఫకీరుల, బీదల శూన్యపాత్రలన్" అని రాశాడు. ఫకీరు కూడా ఉర్దూ పదమే కదా!

ఇక మహాకవి శ్రీశ్రీ మహాప్రస్థానంలో పారశీ భూయిష్టమైన ఉర్దూ పదాలను చాలా విరివిగా వాడినాడు. తారీఖులు, దస్తావేజులు, మతలబులు, కైఫీయత్తులు, కదం, దగా మొదలగు పదాలు శ్రీశ్రీ కవిత్వానికి సౌందర్యంతో పాటు అమరత్వాన్ని కూడ ప్రసాదించాయి.

ఇక వ్యవహార భాష విషయానికి వస్తే ఆంధ్రప్రాంతపు తెలుగువారు, తెలంగాణ ప్రాంతపు తెలుగు వారికంటే ఉర్దూ పదాలను చాలా విరివిగా వాడతారు. ఈ వాస్తవానికి తెలుగు ప్రసార మాధ్యమాలు దర్పణం పడతాయి. తెలుగు వాడుక భాషలో మిళితమైన ఉర్దూ పదాలు కోకొల్లలు. కానీ అవి ఉర్దూ పదాలనే విషయం వాటిని వాడే వారికి బహుశ తెలియదు. ఈ సందర్భంగా మచ్చుకి కొన్ని పదాలు పాపయ్యశాస్త్రి గారికి వినిపించాము. అవి-

దరఖాస్తు, మంజూరు, ఫిర్యాదు, అర్జీ, పైరవీ, తనిఖీ, తనఖా, ముసాయిదా, వకాల్తా, వకీలు, తర్జుమా, జవాబు, సవాళ్ళు, తాఖీదు, తయారు, తాలూకు, ఇలాకా, సిఫార్సు, నకలు, సిఫాయి, మహజరు, కదం, కందకం, బురుజు, ఖాతరు, బేఖాతరు, బేవార్సు, హైరానా, నజరానా, పేషీ, అజమాయిషీ, రాజీ, రాజీనామా, జమీందారు, ఖబర్దారు, జబర్దస్తీ, కలేజా, కుస్తీ, దగాకోరు, దగుల్బాజీ, ఖాళీ, ధోకా, నామోషీ, మజాకా, బహదూరు, బినామీ, బేకారు, బాపతు, బద్‌నామ్, తడాక, వాపసు, పరారీ, గోరీ, పంచాయితీ, ఫైసలా, కసరత్తు, మద్దతు, వాయిదా, ఆదా, బందు, గూండా, పహిల్వాన్, బద్మాష్, దాదాగిరీ, కితాబు, నమూనా, నకిలీ, నగిషీ, లడాయి, కబ్జా, తమాషా, షికారు, జల్సా, పుకారు, నిషా, ఖుషీ,

మజా, మిఠాయి, ఖారా, ఖూనీ, ఖజానా, ఖాతా, జమా, ఖర్చు, చిల్లర, నగదు, బాకీ, వసూళ్ళు, దుకాణం, బజారు, చందా, జరిమానా - ఇంకా ఎన్నో వందల పదాలు ఉన్నాయి.

ఆంధ్ర అంతటా వాడే తెలుగు భాషలో ఉర్దూ పదాలు ఇంత విరివిగా ప్రవేశించిన నేపథ్యంలో, తెలంగాణలో మాట్లాడే తెలుగును తౌరక్యాంధ్రం అనడం ఎక్కడి న్యాయం, ఎంతటి న్యాయం అని అంటే, పాపయ్య శాస్త్రి నివ్వెరపోయాడు. అధిక సంఖ్యలో ఉన్న ఆంధ్రులు ఏమి అన్నా చెల్లుతుంది, కానీ అల్పసంఖ్యలో ఉన్న తెలంగాణవారు నిజం చెప్పినా చెల్లదు. దీనినే అంబేడ్కర్ పరిభాషలో చెప్పాలంటే మైనారిటీ వర్గంపై మెజారిటీ పెత్తందారీతనం అవుతుంది.

నా ప్రసంగాన్ని ముగించే ముందు అప్పటి ఆంధ్ర రాష్ట్రం గురించి అంబేడ్కర్ వెలిబుచ్చిన కొన్ని అభిప్రాయాలను చెప్పడం సందర్భోచితంగా ఉంటుంది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి విడిపోయిన ఆంధ్రప్రాంతం ఒక రాష్ట్రంగా ఏర్పడితే దానికి ఆర్థిక స్వావలంబన ఉండదు .ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని కాగలిగిన నగరం ఒక్కటి కూడా లేదు అని అంటూ, అది ఎండమావులు కూడా లేని ఒక ఎడారి మాదిరి ఉంటుందని అన్నాడు (Andhra is a Sahara and there are no oases in it). మద్రాసు నగరంలోనే ఆంధ్రుల రాజధాని కూడా కావాలన్న ఆంధ్ర నాయకుల కోరిక నెరవేరేది కాదు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆంధ్రులను మద్రాసు నగరంలో రాజగోపాలాచారి ఒక రాత్రి కొరకు కూడాఉండనివ్వడని అంబేడ్కర్ స్పష్టం చేశాడు. పొట్టిశ్రీరాములు

నిరాహార దీక్ష, ఆయన మరణం గురించి ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నాయకత్వం ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్న తరువాత కూడా శ్రీరాములు దీక్షకు కారణం మద్రాసు నగరంలో భాగం కొరకు మాత్రమే. ఈ దీక్షలో శ్రీరాములు మరణించిన తరువాత కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర స్థాపన నిర్ణయాన్ని ప్రకటించడం శ్రీరాములకు ఆంధ్ర రాష్ట్ర రూపంలో పిండ ప్రదానం చేసినట్లు ఉన్నదని అంబేడ్కర్ వ్యాఖ్యానించాడు.

అదేవిధంగా బొంబాయి నగరాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా చేయాలని గుజరాతీలు వాదించినపుడు అంబేడ్కర్ ప్రతిస్పందన గురించి కూడా ఈ సందర్భంలో తెలుసుకోవడం అవసరం. ఉమ్మడి బొంబాయి రాష్ట్రం నుండి గుజరాత్ విడిపోతే బొంబాయి నగరంలోనే వారి రాజధాని ఉండాలనీ, దాని కొరకు బొంబాయి నగరాన్ని కేంద్ర పాలిత ప్రాంతం చేయాలనీ, గుజరాతీలు వాదించేవారు. గుజరాతీలు బొంబాయిలో చేసిన వ్యాపార వాణిజ్యాల వల్లనే బొంబాయి నగరం అభివృద్ధి చెందిందనేది వారి వాదన. ఈవాదనను అంబేడ్కర్ తీవ్రంగా ఖండించాడు. ఒక ఇంటివారు మరొకరి ఇంటిలో అద్దెకుండో, లేక తాకట్టుపెట్టుకొనో, వారి అవసరార్థం దానికి కావలసిన మరమ్మత్తులు చేసి, అదనపు గదులు కట్టి రంగులు వేసినంత మాత్రాన అది వారి సొంత ఇల్లు ఎలా కాదో, వ్యాపారం చేసుకోవడానికి గుజరాతీలు బొంబాయికి వచ్చినంత మాత్రాన ఆ నగరం వారి సొత్తు అయిపోదు. ఈ కారణంగా ఒకవేళ బొంబాయి నగరాన్ని కేంద్ర పాలిత ప్రాంతం చేయవలసివస్తే, దానికంటే ముందు

మద్రాసు, కలకత్తా నగరాలను కూడా కేంద్ర పాలిత ప్రాంతాలు చేయవలసి వస్తుంది. అంతేకాక ఒకవేళ బొంబాయి కేంద్ర పాలిత ప్రాంతమయితే దానికి కావలసిన నీరు, విద్యుచ్ఛక్తిని మహారాష్ట్ర ఎందుకిస్తుంది? అదేవిధంగా బొంబాయిలో స్థిరపడిన మహారాష్ట్ర మేధావుల సేవలు మహారాష్ట్రకు ఎలా అందుతాయి? అందుకే బొంబాయి నగరాన్ని మహారాష్ట్రతో విడదీసి కేంద్ర పాలిత ప్రాంతం చేయడం సాధ్యమూ కాదు, వాంఛనీయమూ కాదు. అంబేడ్కర్ చేసిన ఈ పదునైన వాదన హైదరాబాదు నగరానికి కూడా వర్తిస్తుంది.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే హైదరాబాదును కేంద్ర పాలిత ప్రాంతంగా కానీ, ఉమ్మడి రాజధానిగా కానీ చేయాలని కొందరు రాజకీయ నాయకులు వాదిస్తున్నారు. ఇది కూడా అసాధ్యం, అవాంఛనీయం. అంబేడ్కర్ తర్కాన్నే ఇక్కడ కూడా అన్వయించవలసి వస్తుంది. తెలంగాణ నుండి హైదరాబాదును విడదీస్తే దానికి నీళ్ళు, విద్యుచ్ఛక్తి ఎక్కడి నుండి వస్తాయి? హైదరాబాదుకు చెందిన తెలంగాణ మేధావుల సేవలను తెలంగాణ రాష్ట్రం ఎందుకు కోల్పోవాలి? గుజరాతీలు బొంబాయికి బ్రతుకుదెరువు కోసం ఎలా వచ్చారో, ఆంధ్రులు కూడా హైదరాబాదుకి అలానే వచ్చారు. అంతమాత్రాన ఆంధ్రులకు హైదరాబాదుపై హక్కు ఎలా ఏర్పడుతుంది?

ఇది నడుస్తున్న చరిత్ర . ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ చరిత్ర. ఈ చరిత్ర తొలి దశకు సాక్షులైన ముగ్గురు మేధావులు - జవహర్‌లాల్ నెహ్రూ, ఫజల్అలీ,డా॥ బి.ఆర్. అంబేడ్కర్; ఈ రోజు

మనమధ్య ఉండి ఉంటే ఏవిధంగా స్పందించేవారు? అది ఊహించడం అంతకష్టం కాదు.

జవహర్‌లాల్ నెహ్రూ "ఆంధ్రతో తెలంగాణ విలీనం ఒక వివాహబంధం వంటిది. పొంతన కుదరకపోతే ఎప్పుడైనా విడాకులిచ్చుకోవచ్చు." అని ఏనాడో అన్నాడు. ఇప్పుడు చేయవలసిన పని అదే!

ఫజల్ అలీ "తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగానే ఉండాలని నేనప్పుడే చెప్పాను. ఇప్పుడూ అదే అంటాను. కొత్తగా చెప్పేదేమీ లేదు"అని అన్నాడు.

ఇక అంబేడ్కర్ తను నిర్ధారించిన ప్రమాణాల దృష్ట్యా తెలంగాణ ఒక ఆదర్శవంత రాష్ట్రం అవుతుంది, కనుక రాష్ట్ర సాధన కొరకు నడుస్తున్న ఉద్యమానికి బహుశ తానే నాయకత్వం వహించేవాడేమో!

ధన్యవాదాలు.

Dr. B. R. AMBEDKAR MEMORIAL LECTURE SERIES

1. **Inaugural Lecture** (6-12-1986) - Social Philosophy of Dr.B.R.Ambedkar: By Prof.A.M. Rajasekharaiah (Dr.Baba Saheb Ambedkar Professor of Political Science, Karnataka, University, Dharwar).
2. **Lecture-II** (6-12-1987) - Dr.B.R.Ambedkar : A Vision of the Constitution; By Dr. Justice O. Chinnappa Reddy (Former Judge, Supreme Court of India)
3. **Lecture -III** (6-12-1988) - Education & Emancipation of Dalits: Dr.B.R.Ambedkar's Perspective; By Prof.J.V. Raghavender Rao (Dept.of Sociology, Osmania University, Hyderabad).
4. **Lecture -IV** (6-12-1989) - Indian Caste System - Origin, Annihilation - Dr. B.R. Ambedkar's Perspective; By Prof. K. Venkateswarlu (Dept. of Political Science & Public Administration, Andhra University, Visakhapatnam)
5. **Lecture-V**(6-12-1990) - Dr.B.R.Ambedkar's Perspective on Indian Women; By Prof.G.Haragopal (Dept. of Political Science, Central University of Hyderabad)
6. **Lecture-VI** (6-12-1991) - Dr.B.R.Ambedkar's Concept of Political Power and the question of Dalit Movement; By Prof.Gopal Guru(Dept. of Political Science & Public Administration , University of Poona, Pune)
7. **Lecture-VII** (6-12-1992) - Dr.B.R.Ambedkar-National Integration;By Dr.Justice Gopal Rao Ekbote (Former Chief Justice of A.P. High Court).
8. **Lecture-VIII** (6-12-1993) - Dr.B.R.Amberkar-Social Justice;By Dr.Justice Kottapalli Punnayya (Former Judge,A.P. High Court).
9. **Lecture-IX** (6-12-1994) - Dr.B.R.Ambedkar's Strategy of Economic Development & Its Relevance; By Prof. G.Nancharaiah (Dept. of Economics, University of Hyderabad).
10. **Lecture - X** (6-12-1995) - The Challenge of Mobilising the Marginalised : A Comparative estimate of Dr. B.R. Ambedkar and his successors; By Prof. R.V.R. Chandrasekhar Rao, (Former Vice-Chancellor, Dr. B.R. Ambedkar Open University; presently President & Director, The Common Wealth of Learning Vancouver, Canada)
11. **Lecture-XI** (6-12-1996) - Buddhism-Dr.B.R.Ambedkar; By Prof. V.Ramakrishna(Head, Dept.of History, Central University of Hyderaba)

12. **Lecture - XII** (6-12-1997) - 50 Years of Independence: Achievements of the Constitution of India; By Justice Sri Motilal B.Naik (Hon'ble Judge, High Court of A.P.)

13. **Lecture-XIII** (6-12-1998)- నేటి రాజకీయ పరిస్థితులు : డా॥ బి. ఆర్. అంబేడ్కర్ భావాల ఆవశ్యకత; ఎ.బి.కె. ప్రసాద్ (ప్రముఖ పత్రికా సంపాదకులు)

14. **Lecture - XIV** (6-12-1999) - Economic Philosophy of Dr. B.R. Ambedkar, By Prof. K. Chakradhar Rao (Dept. of Economics, Osmania University)

15. **Lecture - XV** (6-12-2000) - Dr. B.R. Ambedkar : Rights of Minorities in the Constitution, By Justice Mr. Sardar Ali Khan [Hon'ble Judge of A.P. High Court (Retd.)]

16. **Lecture -XVI** (6-12-2001)-Dr.B.R.Ambedkar as an Educationist;ByProf.V.S.Prasad(ViceChancellor,Dr.B.R. Ambedkar Open University, Hyderabad).

17. **Lecture - XVII** (6-12-2002) - Dr. B.R. Ambedkar and Human Dignity ; By Dr. Justice K. Ramaswamy (Former Justice, Supreme Court of India & Former Member, National Human Rights Commission of India)

18. **Lecture - XVIII** (6-12-2003) - Globalisation - Dalits; By Prof. D. Narasimha Reddy (Dept. of Economics, Central University of Hyderabad)

19. **Lecture - XIX** (6-12-2004) - Dr. B.R. Ambedkar - Smaller States ; By Prof. K. Jayashankar (Former Vice-Chancellor, Kakatiya University)

20. **Lecture - XX** (6-12-2005) - Dr. B.R. Ambedkar and his critique of Indian Society; By Prof. G. Satyanarayana (Head, Dept. of Sociology - Osmania University)

21. **Lecture - XXI** (6-12-2006) - 50 years after Dr. B.R. Ambedkar - A Review ; By Prof. Nanduram (Professor, Dr. B.R. Ambedkar Chair of Sociology, Jawaharlal Nehru University, New Delhi)

22. **Lecture - XXII** (6-12-2007) - Dr. B.R. Ambedkar as Feminist; By Smt. R. Akhileshwari (Special Correspondent - Deccan Herald)

- The First All India Dalit Writers Conference - 1987 (A Commemorative Volume) & (Who's Who); Editor: BojjaTharakam
- Dr.B. R. Ambedkar Memorial Lectures in Telugu; Volume-1(6 Lectures).

* * * * *